RNI Regd No. 06225/99

## సాహిత్యం వివరాలు

| | | |
|---|---|---|
| 1. | పరివ్రాజకుల కరదీపిక | 180.00 |
| 2. | నవయుగ సాహిత్యము | 180.00 |
| 3. | నవ్యయుగావతరణకు ఏకాదశ పుష్పాలు | 140.00 |
| 4. | యూనివర్సల్ మైండ్ | 130.00 |
| 5. | అమృతత్వ విద్య | 120.00 |
| 6. | సూర్యకిరణ విజ్ఞానము | 110.00 |
| 7. | ఆహార విజ్ఞానము | 110.00 |
| 8. | వేదమయ జీవనము | 90.00 |
| 9. | రహస్య జ్యోతిర్విద్య | 60.00 |
| 10. | ఆత్మకథ | 60.00 |
| 11. | విశిష్ట యోగసాధనలు | 60.00 |
| 12. | అకల్ట్ అనాటమీ, వేదిక్ వాస్తు, ఆస్ట్రాలజీ, హోమియోపతి | 60.00 |
| 13. | గహనా కర్మణో గతిః | 50.00 |
| 14. | ప్రాక్టికల్ థియాసఫీ | 50.00 |
| 15. | ఆధ్యాత్మిక విద్య లక్ష్యము | 30.00 |
| 16. | త్రిముఖీ గాయత్రీమాత ధ్యానవిధానము | 25.00 |
| 17. | శ్రీసూక్తము | 20.00 |
| 18. | 10 ఆసనాలు - సూర్య నమస్కారాలు | 10.00 |

**ప్రతులకు :**

| | | |
|---|---|---|
| ✧ గురు సీతారామ్ | భీమవరం | 90106 47325 |
| ✧ శ్రీమతి బి. అనూరాధ | రేపల్లె | 90309 80315 |
| ✧ శ్రీమతి కె. సౌజన్య | విశాఖపట్నం | 98858 74477 |
| ✧ శ్రీమతి ఎమ్.వి. సుబ్బులు | హైదరాబాద్ | 94909 94835 |

భూమి స్వర్గముగా మారటానికి
మానవజాతి సాధించవలసిన
5 లక్ష్యాలు

| | |
|---|---|
| ఒకే శక్తి | - సూర్యకిరణాల శక్తి |
| ఒకే ధర్మము | - దేహములే దేవాలయాలు |
| ఒకే విశ్వము | - ఎల్లలు లేని యుద్ధాలు లేని ప్రపంచము |
| ఒకే భాష | - ప్రేమ, మౌనము |
| ఒకే కరెన్సీ | - ఒకే వినిమయ సాధనము |

# స్వర్ణయుగము

నూతన యుగపు మాసపత్రిక



☆ జీవితమనే ఈ మహాభారత సంగ్రామంలో

-- భౌతిక సంపదలు అనే 60 వేల మంది నారాయణ సేన మీకు కావాలా? లేకపోతే

-- అంతరాత్మ యొక్క సారథ్యం మీకు కావాలా?

*మీ జీవితాన్ని సఫలం చేసుకోవాలి అంటే,*

దుర్యోధనుని వలె భౌతిక సంపదల్ని కోరుకోకండి!
అర్జునుని వలె అంతరాత్మ సారథ్యానికే ఓటు వేసి,
జీవిత సామ్రాజ్యానికి చక్రవర్తులు కండి!

అంతరాత్మ ప్రబోధం ప్రకారం జీవిస్తూ
యోగులుగా మారండి!

రూ. 20.00 జూన్ 2013 90

30.5.13 నాటికి స్వర్ణయుగము మాసపత్రిక సభ్యుల సంఖ్య : 144

## విషయ సూచిక


- పంచభూతాలతో ఏర్పడిన ప్రకృతికి పాంచ భౌతిక శరీరధారికి ఉన్న సంబంధము 4
- పంచ భూతాత్మక స్వరూపుడు మానవుడు 10
- ప్రాకృతిక జీవనమే ఆనందానికి మూలం 11
- ఈనాటి ప్రాణాంతక వ్యాధులకు కారణం అప్రాకృతిక జీవిత విధానమే 15
- అమెరికా ఆధిపత్యానికి గండికొట్టిన ఇరాక్ యుద్ధం 21



సంపుటి - 8 సంచిక - 6

స్వర్ణయుగము మాసపత్రిక

సంవత్సర చందా : రూ. 240.00

ఆంధ్రా బ్యాంక్ ఆన్‌లైన్ ఎకౌంట్ నెం.
00461 00110 20050
IFSC Code : ANDB 0000046



చందా పంపించవలసిన చిరునామా :
గురు సీతారాము
8-2-6/9-1, ప్రశాంతి వీధి,
నర్సయ్య అగ్రహారం,
భీమవరం - 534 201, ప.గో. జిల్లా.
ఫోన్ నెం. : 90106 47325
78421 33860



Printed and Published by P. Sita Ramudu and Printed at Akhanda Gurusatta Printers, Bhimavarm and Published at 8-2-6/9-1, N. Agraharam, Bhimavaram, W.G. Dt., A.P.

Editor : P. Sita Ramudu




ఓం సాయి వేంకటేశ శ్రీరాం ఓం

ఈ దిగువ పరిజనుల భాగస్వామ్యముతో ఈ సంచిక వెలువడినది

| | |
|---|---|
| శ్రీమతి బి. అనూరాధ | రేపల్లె |
| శ్రీమతి కె. సౌజన్య | విశాఖపట్నం |
| శ్రీమతి ఎస్. రాజేశ్వరి | విశాఖపట్నం |
| చి॥ కె. అరిహంత్ | హైదరాబాద్ |

❋ అందరికీ మంచి చేసే పనులు కీర్తిని సంపాదించి పెడతాయి. అందువలన కీర్తి అనేది సామూహిక శ్రేయస్సును అందజేసే పనులు వలన వస్తుంది.

రావణాసురుడు శ్రీమంతుడే,
కానీ కీర్తివంతుడు కాదు.

❋ స్వప్రయోజనము కొరకు ఏమి చేసినా అది రాక్షసీ వృత్తే. అది కీర్తిని కలిగించదు.

❋ అపరిగ్రహ వృత్తి మరియు అస్తేయ వృత్తి వ్యక్తిగతమైన కీర్తిని సంపాదించి పెట్టడమే కాకుండా, సామూహిక శ్రేయస్సుకు కారణభూతమౌతాయి.

-- "శ్రీసూక్తము" నుండి

# పంచభూతాలతో ఏర్పడిన ప్రకృతికి, పాంచ భౌతిక శరీరధారికి ఉన్న సంబంధము

ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథ్వి అనే పంచభూతాలతో ఏర్పడినది కాబట్టే ఈ చరాచర సృష్టి లేదా ప్రకృతి "ప్ర-పంచము" అనే పేరుతో పిలువబడుతోంది అని మాస్టరుగారు (డా॥ ఎమ్. శ్రీరామకృష్ణగారు) చెబుతారు.

మానవ శరీరము కూడా ఇదే పంచ భూతాలతో ఏర్పడుతుంది కాబట్టే మన శరీరాన్ని "పాంచ భౌతిక శరీరం" అని పిలుస్తారు.

మనలో ఈ పంచ భూతాలు 24 తత్వాలుగా ఏ విధంగా ఆవిర్భవిస్తాయో మాస్టరుగారి ఉపన్యాసాలతో వెలువడిన "పరివ్రాజకుల కరదీపిక" అనే పుస్తకంలో విపులంగా వివరించబడింది.

మొట్టమొదట సృష్టిలో ఆ ఒకే ఒక, ఏకైక భగవత్తత్వము నుండి మన కంటికి కనిపించే పంచ భూతాలకు ఆధారమైన పంచతత్వాలు ఏర్పడతాయి.

ఆకాశము,
ఆకాశము నుండి వాయువు,
వాయువు నుండి అగ్ని,
అగ్ని నుండి జలము,
జలము నుండి పృథ్వి
ఈ విధంగా ఐదు తత్వాలు ఏర్పడతాయి.

ఈ ఐదు తత్వాలు యొక్క విభిన్న కలయికలతో ప్రకృతి ఏర్పడుతుంది.



### ఆకాశతత్వ పరిణామం

మానవ శరీరంలో ఈ ఆకాశతత్వం మొట్టమొదట రెండుగా మారుతుంది. అందులో సగం ఆకాశం "జీవాత్మ"గా మారుతుంది.

మిగతా సగం ఆకాశం నాలుగు భాగాలుగా మారి, మిగిలిన నాలుగు తత్వాలతో సంబంధం పెట్టుకుంటుంది. అంటే ఈ నాలుగు భాగాలు ఒకొక్కటి మొత్తం ఆకాశంలో 1/8 వంతు ఉంటుంది. 1/2+1/8+1/8+1/8+1/8 = 1

- సగభాగము (1/2) ఆకాశం "జీవాత్మ" గా మారుతుంది.
- -- 1/8 వంతు ఆకాశం వాయువుతో కలిసి "మనస్సు"
- -- 1/8 వంతు ఆకాశం అగ్నితో కలిసి "బుద్ధి"
- -- 1/8 వంతు ఆకాశం జలంతో కలిసి "చిత్తము"
- -- 1/8 వంతు ఆకాశం పృథ్వితో కలిసి "అహంకారం" ఏర్పడతాయి.
- ఈ విధంగా ఆకాశతత్వము వలన మనోబుద్ధి చిత్త అహంకారాలు జీవాత్మలో ఏర్పడతాయి.

### వాయుతత్వ పరిణామము

- సగభాగము (1/2) వాయువు "వ్యాన వాయువు" గా ఏర్పడుతుంది.
- -- 1/8 వంతు వాయువు ఆకాశంతో కలిసి "సమాన వాయువు"
- -- 1/8 వంతు వాయువు అగ్నితో కలిసి "ఉదాన వాయువు"
- -- 1/8 వంతు వాయువు జలముతో కలిసి "ప్రాణ వాయువు"
- -- 1/8 వంతు వాయువు పృథ్వితో కలిసి "అపాన వాయువు" ఏర్పడతాయి.
- ఈ విధంగా వాయుతత్వము వలన "పంచ ప్రాణాలు" ఏర్పడతాయి.

**అగ్నితత్వ పరిణామము**

❊ సగభాగము (1/2) అగ్ని "కన్ను" గా మారుతుంది.

-- 1/8 వంతు అగ్ని ఆకాశముతో కలిసి "చెవి"

-- 1/8 వంతు అగ్ని వాయువుతో కలిసి "చర్మము"

-- 1/8 వంతు అగ్ని జలముతో కలిసి "నాలిక"

-- 1/8 వంతు అగ్ని పృథ్వితో కలిసి "ముక్కు" ఏర్పడతాయి.

❊ ఈ విధంగా అగ్నితత్వము వలన "జ్ఞానేంద్రియాలు" ఏర్పడతాయి.

**జలతత్వ పరిణామము**

❊ సగభాగము (1/2) జలము "రస" తన్మాత్రగా మారుతుంది.

-- 1/8 వంతు జలము ఆకాశముతో కలిసి "శబ్దము"

-- 1/8 వంతు జలము వాయువుతో కలిసి "స్పర్శ"

-- 1/8 వంతు జలము అగ్నితో కలిసి "రూపము"

-- 1/8 వంతు జలము పృథ్వితో కలిసి "గంధము" ఏర్పడతాయి.

❊ ఈ విధంగా జలతత్వము వలన "తన్మాత్రలు" ఏర్పడతాయి.

**పృథ్వీతత్వ పరిణామము**

❊ సగభాగము (1/2) పృథ్వీతత్వము "గుదాద్వారము" గా మారుతుంది.

-- 1/8 వంతు పృథ్వి ఆకాశముతో కలిసి "వాక్కు"

-- 1/8 వంతు పృథ్వి వాయువుతో కలిసి "చేతులు"

-- 1/8 వంతు పృథ్వి అగ్నితో కలిసి "కాళ్ళు"

-- 1/8 వంతు పృథ్వి జలముతో కలిసి "జననేంద్రియము" ఏర్పడతాయి.



❊ ఈ విధంగా పృథ్వీతత్వము వలన "కర్మేంద్రియాలు" ఏర్పడతాయి.

4 అంతఃకరణాలు + 5 ప్రాణ శక్తులు + 5 జ్ఞానేంద్రియాలు + 5 తన్మాత్రలు + 5 కర్మేంద్రియాలు = మొత్తము 24.

పంచభూతాలు నుండి ఆవిర్భవించే ఈ 24 తత్వాలు గురించే కాకుండా ఇంకొక విధమైన వివరణ కూడా 17.3.2013 నాటి సాక్షి దినపత్రిక "ఫన్ డే" సంచికలో వెలువడింది. దానిని కూడా ఈ దిగువన ఒకసారి పరిశీలిద్దాం.

**(ప్రారంభం......)**

ఆధ్యాత్మిక గురువులు చెప్పేదాని ప్రకారం పంచభూతాల క్రమ నిష్పత్తిలో ప్రపంచం ఏర్పడే పద్ధతిని పంచీకరణం అంటారు.

మన దేహంలో ఆకాశం, వాయువు, అగ్ని, జలం, పృథ్వి నిష్పత్తులు ఈ క్రింది విధంగా మారుతూ ప్రాణశక్తులుగా ప్రవహిస్తాయి.

ఈ పంచ భూతాలు ఒకొక్కటి తొలుత రెండు భాగాలుగా అవుతాయి.

అందులో ఒక సగం ఇంకొక నాలుగు భాగాలుగా విభజింపబడి, మిగిలిన నాలుగు భూతాలతో కలిసి వివిధ రకాలుగా పరిణామం చెందుతాయి.

**ఆకాశతత్వ పరిణామము**

❊ సగభాగము (1/2) ఆకాశం "దుఃఖము" గా మారుతుంది.

-- 1/8 వంతు ఆకాశం వాయువుతో కలిసి "కామము"

-- 1/8 వంతు ఆకాశం అగ్నితో కలిసి "క్రోధము"

-- 1/8 వంతు ఆకాశం జలంతో కలిసి "మోహము"

-- 1/8 వంతు ఆకాశం పృథ్వితో కలిసి "భయము" ఏర్పడతాయి.

## వాయుతత్వ పరిణామము

| | | |
|---|---|---|
| ✣ | సగభాగము (1/2) వాయువు | "పరుగు" గా అవుతుంది. |
| -- | 1/8 వంతు వాయువు ఆకాశంతో కలిసి | "దాటడం" గా |
| -- | 1/8 వంతు వాయువు అగ్నితో కలిసి | "తిరగడం" గా |
| -- | 1/8 వంతు వాయువు జలముతో కలిసి | "చలనం" గా |
| -- | 1/8 వంతు వాయువు పృథ్వితో కలిసి | "సంకోచం" గా అవుతుంది. |

## అగ్నితత్వ పరిణామము

| | | |
|---|---|---|
| ❃ | సగభాగము (1/2) అగ్ని | "ఆకలి" గా మారుతుంది. |
| -- | 1/8 వంతు అగ్ని ఆకాశముతో కలిసి | "నిద్ర" గా |
| -- | 1/8 వంతు అగ్ని వాయువుతో కలిసి | "దప్పిక" గా |
| -- | 1/8 వంతు అగ్ని జలముతో కలిసి | "సంగమం" గా |
| -- | 1/8 వంతు అగ్ని పృథ్వితో కలిసి | "కోరిక" గా ఏర్పడుతుంది. |

## జలతత్వ పరిణామము

| | | |
|---|---|---|
| ✳ | సగభాగము (1/2) జలము | "శుక్లము" అవుతుంది. |
| -- | 1/8 వంతు జలము ఆకాశముతో కలిసి | "లాలాజలము" |
| -- | 1/8 వంతు జలము వాయువుతో కలిసి | "చెమట" |
| -- | 1/8 వంతు జలము అగ్నితో కలిసి | "మూత్రము" |
| -- | 1/8 వంతు జలము పృథ్వితో కలిసి | "రక్తము" ఏర్పడతాయి. |

## పృథ్వీతత్వ పరిణామము

| | | |
|---|---|---|
| ❀ | సగభాగము (1/2) పృథ్వీతత్వము | "ఎముకలు" గా మారుతుంది. |



| | | |
|---|---|---|
| -- | 1/8 వంతు పృథ్వి ఆకాశముతో కలిసి | "గోళ్ళు, వెంట్రుకలు" |
| -- | 1/8 వంతు పృథ్వి వాయువుతో కలిసి | "చర్మము" |
| -- | 1/8 వంతు పృథ్వి అగ్నితో కలిసి | "నరాలు" |
| -- | 1/8 వంతు పృథ్వి జలముతో కలిసి | "మాంసము" ఏర్పడతాయి. |

ప్రకృతికి దూరం జరగడం వల్ల, పంచభూతాల మధ్య సమతుల్యత లోపించడమే మనిషి దేహంలో తలెత్తే రుగ్మతలకు కారణము.

వాటికి దగ్గరగా జరగడమే చికిత్స!

**(....... ముగింపు)**

ఈ విధంగా మానవుడి యొక్క భౌతిక శరీరము, అతని యొక్క అంతః ప్రవృత్తులు కూడా పంచభూతాలతోనే ఏర్పడ్డాయి.

అదే విధంగా ఈ చరాచర ప్రకృతి మొత్తం కూడా పంచభూతాలతోనే ఏర్పడి ఉండటం వలన మానవ శరీరధారికి, ప్రకృతికి మధ్య అన్యోన్యమైన ఘనిష్ట సంబంధం ఏర్పడివుంది.

అందుచేత మానవుడు ప్రకృతికి ఎంత దగ్గరగా జీవిస్తే, అతని జీవితం అంత ఆనందమయం అవుతుంది. అతడు ప్రకృతికి ఎంత దూరం అయితే, అతని జీవితం అంత నరకప్రాయం అవుతుంది.

ఈనాటి ఆధునిక జీవన శైలితో మానవుడు ప్రకృతికి దూరం అవుతూ, తన బహిరంతర జీవితాలను దుఃఖమయం చేసుకుంటున్నాడు.

ఈనాటి ఆధునిక విజ్ఞానాన్ని మానవజాతి ప్రకృతికి అనుగుణ్యంగా ఉపయోగించుకోగలిగితే, భూమి తప్పకుండా స్వర్గంగా మారుతుంది.

❃✣❃

## పంచ భూతాత్మక స్వరూపుడు మానవుడు

| తత్వము | ఆకాశము | వాయువు | అగ్ని | జలము | పృథ్వి |
|---|---|---|---|---|---|
| ఆకాశము | జీవాత్మ | మనస్సు | బుద్ధి | చిత్తము | అహంకారము |
| వాయువు | సమానము | వ్యానము | ఉదానము | ప్రాణము | అపానము |
| అగ్ని | చెవి | చర్మము | కన్ను | నాలుక | ముక్కు |
| జలము | శబ్దము | స్పర్శ | రూపము | రసము | గంధము |
| పృథ్వి | వాక్కు | చేతులు | కాళ్ళు | జననేంద్రియం | గుదము |
| ఆకాశము | దుఃఖము | కామము | క్రోధము | మోహము | భయము |
| వాయువు | దాటడం | పరుగు | తిరగడం | చలనం | సంకోచం |
| అగ్ని | నిద్ర | దప్పిక | ఆకలి | సంగమం | కోరిక |
| జలము | లాలాజలము | చెమట | మూత్రము | శుక్లము | రక్తము |
| పృథ్వి | గోళ్ళు, వెంట్రుకలు | చర్మము | నరాలు | మాంసము | ఎముకలు |



# ప్రాకృతిక జీవనమే ఆనందానికి మూలం

పూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య దగ్గరకి ఒకసారి సోషియాలజీ (సామాజిక అభివృద్ధి శాస్త్రం) లో పోస్ట్ గ్రాడ్యుయేట్ చేస్తున్న కొంత మంది విద్యార్థులు వచ్చారట.

ఆయన వారితో మాట్లాడుతూ, "మీ కోర్సు పూర్తయిన తరవాత ఏం చేద్దామనుకుంటున్నారు?" అని అడిగారట.

"మేము వెంటనే కోయ గూడాలకు వెళ్ళిపోయి, అక్కడ ఉన్న గిరిజనుల్ని అభివృద్ధి చేస్తాం" అన్నారట వాళ్ళు.

"బాబ్బాబు! ఆ పని మాత్రం చేయకండి. ఆ అడవుల్లో వాళ్ళు ప్రకృతి సిద్ధంగా జీవిస్తూ, చాలా ఆనందంగా బ్రతుకుతున్నారు. వాళ్ళని చెడగొట్టకండి" అని గురుదేవులు వారితో చెప్పారట.

ప్రకృతి ఎప్పుడూ గతిశీలంగా ఉంటుంది.
ఆ గతిశీలత లయబద్ధంగా ఉంటుంది.
ఆ లయబద్ధత సహజంగానే హృదయంలో ఆనందాన్ని రేకెత్తిస్తుంది.

అందుచేత ప్రకృతి సాహచర్యంలో జీవించే సమస్త ప్రాణులు ఈ ప్రకృతి లయలలో ఓలలాడుతూ ఆనందంగా జీవిస్తాయి.

ఈనాటి మన శాస్త్ర సాంకేతిక పెరిగే కొలదీ మనం ప్రకృతికి దూరమై పోయి, మన జీవిత విధానం చాలా అప్రాకృతమైపోతోంది.

దానితో ఆ ఆనందమూ మన జీవితాల నుండి దూరమైపోతోంది.

ప్రాకృతిక జీవిత విధానం కంటే ఈనాటి ఆధునిక అప్రాకృతిక జీవిత విధానం అనేక రెట్లు గతిశీలంగా ఉన్నప్పటికీ, ఆ గతిశీలతలో లయబద్ధత లేదు.

ఆధునిక జీవిత విధానం అయితే యాంత్రికంగా ఉంటోంది.
లేదా, విశృంఖలంగా ఉంటోంది.

విశృంఖల జీవిత విధానం అనారోగ్యాలకు కారణం అయితే,
యాంత్రిక జీవిత విధానం అసంతృప్తికి కారణం అవుతోంది.

✣ "ఎంత గొప్ప జీవితం అయినా, చివరికి ప్రైమ్ మినిస్టర్ ఆఫ్ ఇండియా యొక్క జీవితం అయినా, అది మెకానికల్ అయితే బోర్ కొడుతుంది.

-- అందుచేత వారానికి ఒక రోజైనా, మీ జీవితం డిఫరెంట్‌గా ఉండాలి" అని మాస్టరుగారు సలహా ఇస్తారు.

టెక్నాలజీ వల్ల మన జీవిత విధానం సుఖమయం అయినప్పటికీ, మన జీవితం నుండి సంతోషం లుప్తమైపోతోంది అని అనేక సామాజిక సర్వేలు కూడా తెలియజేస్తున్నాయి.

శాస్త్ర సాంకేతికతలు ఆధారంగా సుఖ సమృద్ధులతో ఓలలాడుతోన్న దేశాలలోని ప్రజలు కంటే ప్రకృతి సాహచర్యంలో జీవిస్తోన్న లాటిన్ అమెరికాలోని దేశాల ప్రజలే చాలా ఎక్కువ సంతోషంగా జీవిస్తున్నారు అని "గ్యాలప్ ఐఎన్‌సీ" అనే సంస్థ జరిపిన సర్వేలో వెల్లడయింది.

"ఆనంద నిలయం లాటిన్ అమెరికా" అనే శీర్షికతో 21.12.12 న "సాక్షి" దినపత్రికలో వెలువడిన ఆ వివరాలను ఒకసారి పరిశీలిద్దాం.

***(ప్రారంభం .......)***

ఈ భూమండలంలో అత్యంత ఆనందంగా గడిపే ప్రజలు ఉండేది ఎక్కడ?



అన్ని రకాలుగా సిరిసంపదలతో తులతూగే ఖతార్‌లోనా?
అధిక ఆయుర్దాయంతో సాంకేతిక పరిజ్ఞానానికి నిలయమైన జపాన్‌లోనా?
కాలేజీల్లో చదివే విద్యార్థులు ఎక్కువగా ఉండే కెనడాలోనా?

ఇవేవీ కానేకాదు.
కనీసం టాప్ టెన్‌లో కూడా వీటికి చోటు దక్కలేదు.

✣ లాటిన్ అమెరికా దేశాలలో నివసించే ప్రజలు "ప్రకృతి సౌందర్యాన్ని ఆరాధిస్తూ" ఆనందంగా జీవిస్తున్నట్లు ఒక అధ్యయనం వెల్లడించింది.

-- దీన్నిబట్టి చూస్తే సంపదకు, సంతోషానికి ముడిపడదేమోననిపిస్తోంది కదూ!

✣ ప్రపంచంలోనే అత్యంత సంతోషంగా గడిపే 10 దేశాల్లో 7 దేశాలు లాటిన్ అమెరికాలోనే ఉన్నట్లు ఆ అధ్యయనం వెల్లడించింది.

-- వీటిలో చాలా వరకూ పేద దేశాలే కావటం గమనార్హం.

దశాబ్దాల పాటు అంతర్యుద్ధంలో మునిగిన గ్వాటెమాలా (క్రిమినల్ గ్యాంగ్‌ల కలహాలతో అతి ఎక్కువగా ఆత్మహత్యలు కూడా నమోదైంది ఇక్కడే) సంతోషానికి పుట్టినిల్లు అంటే నమ్మాల్సిందే మరి.

ఆనందంగా గడపటంలో ఇక్కడి ప్రజలు 7వ స్థానంలో నిలిచారు.

నిత్యం చిరునవ్వుతో కనిపించే గ్వాటెమాలా ప్రజలకు "స్నేహంగా ఉండటం" ఒక సంప్రదాయమని సర్ఫింగ్ శిక్షకుడు లుజ్ కాస్టిలో చెప్పారు.

✣ అధ్యయనంలో చాలా ప్రశ్నలకు సానుకూలంగా (దాదాపు 85%) స్పందించిన పనామా, పరాగ్వే ప్రజలు ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచారు.

-- తరువాత స్థానాల్లో ఎల్ సాల్వెడార్, వెనెజువెలా, ట్రినిడాడ్, థాయ్‌లాండ్, గ్వాటెమాలా, ఫిలిప్పీన్స్, ఈక్వెడార్, కోస్టారికా ప్రజలకు చోటు లభించింది.

బాగా అభివృద్ధి చెందిన సింగపూర్ ప్రజలు మాత్రం భావోద్వేగాలకు అతి తక్కువగా స్పందిస్తున్నట్లు తేలింది.

✣ జర్మనీ, ఫ్రాన్స్‌లు ఆఫ్రికాలోని సోమాలియా సరసన 47 వ స్థానంలో నిలవటం విశేషం.

148 దేశాల్లో సర్వే జరిపి 'గ్యాలప్ ఐఎన్‌సీ' ఈ ఫలితాలను రూపొందించింది. ఒక్కో దేశంలో వెయ్యి మందిని ప్రశ్నించారు.

తగినంత విశ్రాంతి లభిస్తోందా?
గౌరవం దక్కుతోందా?
ఎక్కువగా నవ్వగలుగుతున్నారా?
ఆనందాన్ని ఇచ్చే క్రొత్త పని ఏదైనా నేర్చుకున్నారా?
తదితర ప్రశ్నలను సంధించి జవాబులు రాబట్టారు.

*(...... ముగింపు)*

✣ ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, చలికి వణుకుతూ ప్రకృతి సాహచర్యంలో జీవించే ప్రాణికి సహజంగానే శీతోష్ణాలకు, సుఖదుఃఖాలకు అతీతంగా జీవించగలిగే సామర్థ్యం అలవడుతుంది.

-- ఈ సామర్థ్యం మనిషిని రాగద్వేషాలకు అతీతంగా ఉండే "స్థిత ప్రజ్ఞత్వ" స్థితికి తీసుకొని వెళుతుంది.

-- ఏ పరిస్థితులలోనైనా ఆనందంగా జీవించగలిగే నేర్పు మనిషికి ఈ స్థిత ప్రజ్ఞత్వ స్థితిలోనే లభిస్తుంది.

అందుచేత మనిషి నిరంతరం ఆనందంగా జీవించాలి అంటే, ప్రకృతి సాహచర్యంలో జీవించడం తప్ప ఇంకొక మార్గం లేదు.

✣☆✣



# ఈనాటి ప్రాణాంతక వ్యాధులకు కారణం అప్రాకృతిక జీవిత విధానమే

పంచభూతాలు పరస్పరం ఒక రూపం నుండి ఇంకొక రూపానికి మారే విధానాన్ని అర్థం చేసుకోవడానికి మాస్టరుగారు ఐస్ ముక్క ఆవిరిగా మారే ప్రక్రియను వివరిస్తారు.

☆ ఐస్ ముక్కను (పృథ్వీతత్వం) వేడి చేస్తే,

-- నీరుగా (జలతత్వం) మారుతుంది.

-- దానిని ఇంకాస్త వేడి చేస్తే ఆవిరిగా (వాయుతత్వం) అవుతుంది.

-- ఆ ఆవిరిని ఇంకా బాగా వేడి చేస్తే ఆ మోలిక్యూల్స్ మధ్య దూరం ఇంకా బాగా పెరిగి చివరకు శూన్యం (ఆకాశతత్వం) మిగులుతుంది.

ఈ విధంగా పదార్థము ఒక తత్వం నుండి ఇంకొక తత్వానికి మారడంలో "అగ్నితత్వము" మాధ్యమంగా ఉంటుంది.

మానవశరీరంలో ఈ పంచతత్వాలు ఉండాల్సిన నిష్పత్తిలో సంతులన తప్పినప్పుడు శరీరానికి రోగాలు సంభవిస్తాయి.

☆ ఆకాశతత్వం శూన్యంగా ఉంటుంది.
పృథ్వీతత్వం సోలిడ్ (ఘనపదార్థం) గా ఉంటుంది.

-- అందుచేత ఈ రెండు తత్వాలలో మార్పు అంత తేలికగా జరగదు.

-- మధ్యన ఉన్న వాయువు, అగ్ని, జల తత్వాలలో మార్పు తొందరగా జరిగే అవకాశం ఉంది.

అందుచేత మానవశరీరం ఈ మూడు తత్వాలకు సంబంధించిన దోషాలకు లోనయ్యే అవకాశం ఉంది.

☆ మానవ శరీరంలో ఈ మూడు తత్వాలకు సంబంధించిన లక్షణాలను ఆయుర్వేదం "వాత, పిత్త, కఫాలు" గా గుర్తిస్తోంది.

-- వాయువుకు సంబంధించిన లక్షణము "వాతము"

-- అగ్నికి సంబంధించిన లక్షణము "పిత్తము"

-- జలానికి సంబంధించిన లక్షణము "కఫము"

ఈ మూడు లక్షణాలు ప్రతీ మనిషిలోనూ ఒకే విధంగా ఉండవు.

☆ కొంత మందిలో వాతము (చంచల స్వభావము) ఎక్కువగా ఉంటే,

-- ఇంకొంత మందిలో పిత్తము (ఆవేశ స్వభావము) ఎక్కువగా ఉంటుంది.

-- ఇంకొంత మందిలో కఫము (నెమ్మది స్వభావము) ఎక్కువగా ఉంటుంది.

ఈ మూడు లక్షణాల యొక్క నిష్పత్తులు ఒక నిర్ణీతమైన అవధులలో ఉన్నంత వరకు శరీరానికి అనారోగ్యం సంభవించదు.

మన యొక్క ఆహార, విహారాల వల్ల మనలోని వాత, పిత్త, కఫాలలో మార్పులు సంభవిస్తూవుంటాయి. ఈ మార్పు చాలా ఎక్కువ స్థాయిలో సంభవించినప్పుడు శరీరానికి అనారోగ్యం కలుగుతుంది.

ప్రకృతి నియమాల ప్రకారం జీవించే ప్రతీ ప్రాణిలోనూ ఈ వాత, పిత్త కఫాలు సంతులనతో ఉండటం వలన అవి ఎల్లప్పుడు ఆరోగ్యంగా జీవిస్తాయి.

ప్రకృతి నియమాలను పాటించని ఒక్క మనిషి తప్ప, మిగిలిన ప్రాణికోటి అంతా చాలా ఆరోగ్యంగా జీవిస్తూవుండటం ఈనాటికీ చూస్తూనే ఉన్నాం.

ఆధునిక జీవన శైలి మనల్ని ప్రకృతి నుండి దూరం చేస్తోంది.



ప్రకృతి అంతా లయం అయిపోయివుండే రాత్రి వేళల్లో మనం మెలకువగా ఉంటాం. ప్రకృతి క్రియశీలంగా ఉండే పగటి వేళల్లో విశ్రాంతి తీసుకుంటూ ఉంటాం. ఋతువుకు అనుగుణంగా ఉండే ఆహారాన్ని స్వీకరించం.

దీనితో ఈనాటి సమాజంలో క్యాన్సర్, షుగర్, గుండెజబ్బులు వంటి ప్రాణాంతక వ్యాధులు చాలా ఎక్కువగా పెరిగిపోయాయి.

ఈ వ్యాధులు సమాజంలో ఇంతగా వ్యాపించడానికి కారణం మన యొక్క జీవనశైలియే అని ఆధునిక డాక్టర్లు కూడా తెలియజేస్తున్నారు.

ఈ ప్రాణాంతక వ్యాధుల్లో ఒకటైన "క్యాన్సర్" వ్యాప్తికి మన జీవన శైలి ఏ విధంగా కారణం అవుతోందో, దానిని నివారించుకోవడానికి ప్రాకృతిక జీవనం ఏ విధంగా ఉపకరిస్తుందో అర్థం చేసుకోవడానికి 4.2.13 న "సాక్షి" దినపత్రికలో వెలువడిన ఈ వ్యాసాన్ని ఒకసారి పరిశీలిద్దాం.

**(ప్రారంభం .......)**

ఆయుర్వేదంలో ప్రాచీన వైద్యుడు చరక మహర్షి నిరూపించిన విషయం ఏమిటంటే, శరీరంలోని ఏ అవయవానికైనా, ఏ భాగానికైనా మూలం, కంటికి కనపడని సూక్ష్మాతిసూక్ష్మమైన, అసంఖ్యాకమైన పరమాణు సముదాయమే.

శరీరవయవాస్తు పరమాణు భేదేనం అపరిసంఖ్యేయా భవంతి
అతిబహుత్వాత్, అతి సౌక్ష్మాత్, అతీంద్రియ త్వాత్ చ.

ఇలాంటి పరమాణువుల స్వభావ క్రియ భేదాల వల్ల సప్త ధాతువులైన 'రస, రక్త, మాంస, మేదో, అస్థి, మజ్జా, శుక్రాలు', వాటితో పాటు వివిధ స్రోతస్సులు [illegible] ఏర్పడ్డాయి.

క్యాన్సర్ అనే పదానికి అర్థం 'ఎండ్రకాయ' (కర్కాటకం).

నిశ్శబ్దంగా దొలిచి దొలిచి ధ్వంసం చేయడానికి ఇది పెట్టింది పేరు.
వ్యాధి స్వభావాన్ని బట్టి దీనికి ఈ పేరు వచ్చింది.

ఇలాంటి స్వభావం గల వ్యాధులు ఆయుర్వేదంలో చాలా వాటిని వర్ణించారు. ఈ వ్యాధి సోకిన ధాతువును బట్టి, స్రోతస్సును బట్టి, అవయవాన్ని బట్టి, భాగాన్ని బట్టి పేరు మారుతుంటుంది.

పైన చెప్పిన వాటిలో దేనికి సంబంధించినవైనా కొన్ని అణువులు "నివారింప శక్యం కాకుండా, అవాంఛితంగా పరిమాణంలో పెరిగిపోతుండటమే" ఈ వ్యాధిలో జరిగే ప్రక్రియ.

అణు విభజనకు "వాతం" (న్యూక్లియస్ కర్మలు),
పచింపబడటానికి "పిత్తం" (మైటోకాండ్రియా కర్మలు),
పోషణకు "కఫం" (ప్రోటోప్లాజం కర్మలు) కారణంగా నిలుస్తాయి.

**కొన్ని వ్యాధుల పేర్లు**

తీవ్రస్థాయికి చేరిన అర్బుద, గ్రంథి, అపచి, గండమాల మొదలైనవి.

అర్బుదాలు (కణుతులు), తాలువు, నాలుక, ముక్కు, చెవి, రొమ్ముల్లో కూడా పుడతాయని వాగ్భటాచార్యులు ప్రత్యేకంగా చెప్పారు.

అదే విధంగా ఉపద్రవ స్థాయికి చేరిన రస మరియు రక్త వహస్రోతో దుష్టి లక్షణాలే ఈనాటి బ్లడ్ క్యాన్సర్లు.

**వ్యాధికి కారణాలు**

అసలు కారణం స్పష్టంగా తెలియదు.

☆ వాత పిత్త కఫాల ప్రాకృత కర్మలను చెడగొట్టే ఆహార విహారాలు, ధూమ, మద్యపానాలు, విపరీతమైన మానసిక ఒత్తిడి కారణాల్లో కొన్ని.



శ్రీ ప్రస్తుతం సమాజంలో 90 శాతం ఆహారపదార్థాలు, పాలు, తిను బండారాలు, నూనెలు, పండ్లు సమస్తం కల్తీయే.
ఇది కూడా ఈ "కర్కశ కర్కాటకాని"కి కారణమే.

**చికిత్స**

వ్యాధి తీవ్రతను బట్టి 'ప్రవర, మధ్యమ, అవర' అని విభజించబడింది.
ప్రవరావస్థలో ఫలితాలు బాగుంటాయి.

ఆయుర్వేదం కేవలం రోగవ్యతిరేక చికిత్స మాత్రమే కాకుండా రోగికి బలవర్థకమైన 'రసాయన' చికిత్స, అవసరాన్ని బట్టి శోధన (పంచకర్మ) చికిత్స, శస్త్రచికిత్సతో పాటు రోగం సోకిన భాగాన్ని బట్టి ఎన్నో ఔషధాలను విశదీకరించింది.

**కొన్ని ముఖ్య ఔషధాలు**

ఏకద్రవ్యాలు: భల్లాతకీ (నల్లజీడిగింజ),
అమృతా/గుడూచీ (తిప్పతీగె), చిత్రక (చిత్రమూలం),
హరిద్రా (పసుపు), అశ్వగంధ (పెన్నేరుగడ్డ) ప్రధానమైనవి.

**ఇతర ఏకమూలికలలో:**

శిరీశ్రీ (దిరిసెన), సీతాఫల, తులసి, మారేడు, తమలపాకు, లశున (వెల్లుల్లి), నేల ఉసిరిక (భూమ్యామలకి), కటుక రోహిణి, బ్రాహ్మి, శతావరీ (పిల్లిపీచర), అశోక, మంజిష్ఠ, దుగ్ధిక, త్రిఫలాలు (కరక్కాయ, తానికాయ, ఉసిరి), పాషాణభేది (కొండపిండి) మొదలైనవి చాలా చెప్పబడ్డాయి.

మిశ్రమ ఔషధాలు: భల్లాతకీ లేహ్యం, అమృత భల్లాతకీ లేహ్యం, అగస్త్య రసాయనం, అశ్వగంధాది లేహ్యం, చిత్రకహరీతకీ రసాయనం, ఆమలకీ రసాయనం. గుడూచీసత్వం మొదలైనవి.

గమనిక: రోగి బలాన్ని, వ్యాధి సోకిన భాగాన్ని, అవయవాన్ని బట్టి ఏ ఔషదం, ఏ రూపంలో, ఎంతకాలం వాడాలో ఆయుర్వేద నిపుణులు నిర్ణయించి, పర్యవేక్షించాలేగాని, బైరాగి చిట్కాలు, సాధువుల వైద్యాలు క్యాన్సరును పోగొట్ట లేవు. అలాంటి ప్రకటనలకు మోసపోవద్దు.

**ఆయుర్వేద మార్గంలో నివారణ**

☆ బాల్యం నుంచి శాస్త్రబద్ధంగా కల్తీలులేని, బలవర్ధకమైన సాత్వికాహార సేవన, ఆవునెయ్యి, నువ్వుల నూనే రోజూ రెండేసి చెంచాలు సేవించాలి.

-- పాలు, పెరుగు, వెన్నలు, ఆవువైతేనే శ్రేష్ఠం.
ఇవి రోగనిరోధకశక్తిని పెంపొందిస్తాయి.

-- పరిమిత వ్యాయామం, జీవితాంత ప్రక్రియగా భావించి, ప్రతిదినం చేయాలి.

-- ధూమ, మద్యపానాల వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలి.

-- రాత్రి కనీసం ఏడు గంటలు నిద్రించి బ్రాహ్మీ ముహుర్తంలో నిద్రలేవాలి.

-- మానసికారోగ్యం కాపాడుకోవడం ప్రధానం. కాబట్టి సంతోషం, శాంతం, ఉత్సాహం, కారుణ్యం వంటి లక్షణాలను అనుసరించాలి.
(తన కోపమె తన శత్రువు, తన శాంతమె తనకు రక్ష).
వీటిని ఆయుర్వేదంలో 'ఆచార రసాయనాలు అంటారు.

-- ఉసిరికాయ రసం రోజూ రెండు చెంచాలు త్రాగాలి. లేదా
త్రిఫలా చూర్ణం రోజూ ఒక చెంచా తేనెతో సేవించాలి.

-- పది తులసి ఆకులు, ఐదు మారేడు ఆకులు నమిలి తినాలి.

-- ఏదో ఒక తాజా ఫలం ప్రతిరోజు తినాలి.

☆✡☆



# అమెరికా ఆధిపత్యానికి గండికొట్టిన ఇరాక్ యుద్ధం

మాస్టరుగారు రిఫ్రెషరీ కోర్సు చేయడానికి వైజాగ్‌లోని ఆంధ్రా యూని వర్సిటీకి వెళ్ళినప్పుడు, కేంబ్రిడ్జి యూనివర్సిటీ నుండి వచ్చిన ఒక హిస్టరీ ప్రొఫెసరు కొన్ని బొమ్మల్ని చూపించి, "వీటిని మీరు గుర్తు పట్టగలరా?" అని అడిగారట.

ఆ కోర్సు చేస్తున్న అందరూ నోరు వెళ్ళబెట్టారట. అప్పుడు ఆ ప్రొఫెసరు "ఐనో, ఐనో, ఇవి మీకు తెలియదు అని నాకు తెలుసు!" అన్నారట.

ఇంతకీ అవి శుశ్రుతుడు కాలంలో ఉపయోగించిన బ్రెయిన్ సర్జరీ ఇన్‌స్ట్రుమెంట్స్ అట.

ఈనాడు అల్లోపతీ వైద్యవిధానానికి ఇంత ప్రాచుర్యం రావడానికి కారణం ఏమిటంటే, సర్జరీ (శస్త్రచికిత్స) లో అది చాలా విశిష్ట స్థానానికి ఎగబ్రాకింది.

యుగయుగాలుగా ఋషి పరంపర మన దేశంలో కొనసాగుతోంది అని మనం భావిస్తూవుంటాం.

కానీ ఆధునిక చరిత్రకారులు మొత్తం మన భారతీయ ఋషి సాంప్రదాయాన్ని 5000 సంవత్సరాల చరిత్రలో ఇమడ్చటానికి వాళ్ళు తమ శాయశక్తులా రకరకాల అభూత కల్పనలతో ప్రయత్నిస్తూవుంటారు. వాళ్ళ అంచనా ప్రకారం కూడా శుశ్రుతుడు 5000 సంవత్సరాల క్రిందటి ఒక ఆయుర్వేద వైద్యుడు.

అప్పటికే మన దేశంలో బ్రెయిన్ సర్జరీ పనిముట్లను ఉపయోగించేవారు. అంటే అప్పటికే వైద్యరంగంలో మన దేశం ఏ స్థాయిలో ఉండేదో ఊహించండి.

కేవలం వైద్యరంగంలోనే కాదు, ఖగోళ శాస్త్రం, అణు విజ్ఞానం, అంతరిక్ష యానం మొదలైన అనేక రంగాలలో భారతీయలు చాలా నిష్ణాతులుగా ఉండే వారు అని విదేశీ చరిత్రకారులు కూడా అంగీకరిస్తున్నారు.

ప్రపంచంలోని ఏ జ్ఞానవిజ్ఞానం అయినా అది ప్రకృతిలోని పంచభూతాలకు సంబంధించినదే అయివుంటుంది.

భారతీయులు విజ్ఞానం యొక్క ఉచ్ఛ శిఖరాలకు చేరుకున్నప్పటికీ, ప్రకృతికి మాత్రం దూరం అవలేదు.

పైపెచ్చు ఇంకా ప్రకృతికి దగ్గర అవడానికి ప్రయత్నించారు.

✡ ఋషులు మానవ శరీరాన్ని విశ్వం యొక్క సంక్షిప్త రూపంగా గుర్తించారు.

-- మానవ శరీరం అనే పిండాండాన్ని, విశ్వం అనే బ్రహ్మాండంతో సమన్వయం చేసే విధానాలను ఋషులు అన్వేషించి,

-- ఈ పిండాండ-బ్రహ్మాండంతో మానవుడు మాధవుడు అవుతాడు అని తమ జీవితాలలో నిరూపించారు.

ప్రకృతిలోని పంచభూతాలకు, మానవశరీరంలో పంచభూతాలకు మధ్య సమన్వయాన్ని సాధించే జీవిత విధానాలను ఎవరి స్థాయికి తగ్గట్టు వారికి అందజేశారు.

ఈ విధంగా భారతీయ జీవిత విధానం మొత్తం ప్రకృతి యొక్క సాహచర్యంలో, ప్రకృతితో మమేకం అయ్యే విధంగా తీర్చిదిద్దబడింది.

అందుచేతనే భారతీయులు ప్రకృతికి దగ్గరగా ఉండే గ్రామాలలో నివశించడానికి ఇష్టపడేవారు. భారతదేశంలోని పట్టణాలు, నగరాలు ఈ గ్రామాలను అనుసంధానం చేసే కేంద్రాలుగా మాత్రమే ఉండేవి.



✡ ఒకప్పుడు ప్రపంచంలో ఒక వెలుగు వెలిగిన మెసపటేమియా, గ్రీక్, రోమన్ మొదలైన అనేక నాగరికతలు అంతరించిపోయినా, భారతీయ సంస్కృతి ఇప్పటికీ సజీవంగా నిలిచివుండటానికి కారణం ఏమిటంటే,

-- ప్రకృతికి, భారతీయ సంస్కృతికి మధ్యన ఉన్న అవినాభావ సంబంధమే.

కానీ విదేశీ దండయాత్రల ఫలితంగా ఈ భారతీయ సంస్కృతికి గ్రహణం పట్టింది. భారతీయులు తమ సంస్కృతిని మర్చిపోయి, పాశ్చాత్య అప్రాకృతిక జీవిత విధానానికి పూర్తిగా బానిసలు అయిపోయారు.

అప్రాకృతిక జీవిత విధానం చివరకు అంతరించక తప్పదు.

✡ ఈనాటి ఆధునిక విజ్ఞానం కూడా ప్రకృతికి సంబంధించినదే.

-- ఈ విజ్ఞానాన్ని ప్రకృతి యొక్క అనుసంధానంతో ఉపయోగించుకుని ఉండివుంటే పరిస్థితి వేరే విధంగా ఉండివుండేది కాదు.

-- ఈ యుద్ధాలు, ఆ వాతావరణ కాలుష్యం, అనారోగ్యాలు, అశాంతులు ఉండివుండేవి కాదు.

ఋషులు తమ యొక్క ప్రతీ ఆవిష్కరణను సమాజ కళ్యాణానికే వినియోగించేవారు. ధన సంపాదన కోసమో, అధికారం కోసమో, తమ కీర్తి ప్రతిష్ఠల్ని ఇనుమడింపచేసుకోవడానికో వాటికి ఉపయోగించేవారు కాదు.

✡ కానీ ఈనాటి ప్రతీ ఆవిష్కరణను ఈ భౌతిక స్వార్థాల కోసమో ఉపయోగిస్తున్నారు.

-- ఆధునిక విజ్ఞానాన్ని అభివృద్ధి చేసిన యురోపియన్లు ఆ విజ్ఞానం యొక్క ఆసరాతో మొత్తం ప్రపంచాన్ని ఆక్రమించివేశారు.

-- ఆసియా, ఆఫ్రికాల్లోని అన్ని దేశాల్ని సర్వనాశనం చేశారు.

ఆధునిక విజ్ఞానాన్ని ప్రకృతితో అనుసంధానంగా ఉపయోగించుకునే స్వభావం ఉండివుంటే, ఇతర దేశాలను ఆక్రమించే బుద్ధి యురోపియన్లకు పుట్టివుండేది కాదు. ఇతర దేశాలకు ఆ విజ్ఞాన ఫలాలను అందజేసి, ఋషులుగా, మహాత్ములుగా గౌరవాన్ని పొందివుండేవారు.

దురదృష్టవశాస్తూ, యురోపియన్లు ఆధునిక విజ్ఞానాన్ని రాక్షసులులాగా తమ స్వార్థానికే వినియోగించారు.

స్వార్థమే పరమావధి అయినప్పుడు సంఘర్షణలు తప్పవుకదా!

మానవుడిలో ఉండే స్వార్థానికి విజ్ఞానం తోడు అవడంతో రెండు ప్రపంచ యుద్ధాలు సంభవించాయి.

రెండవ ప్రపంచ యుద్ధంతో ఐరోపా దేశాల ఆధిపత్యం అంతరించి, అమెరికా, సోవియట్ యూనియన్‌లు అగ్రరాజ్యాలుగా అవతరించి, ప్రపంచాన్ని మూడవ ప్రపంచ యుద్ధం అంచుకు తీసుకొని వెళ్ళాయి.

1991 లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం అవడంతో మూడవ ప్రపంచ యుద్ధం ప్రమాదం తప్పినప్పటికీ, అమెరికా ఏకైక అగ్రరాజ్యంగా అవతరించడంతో అప్రాకృతిక జీవిత విధానం మరింత విశృంఖలం అయింది.

మొత్తం సమస్త విశ్వంలో పృథ్విని, ఈ పృథ్వీమాత ఒడిలో ఆశ్రయం పొందుతోన్న మానవుడిని భగవంతుడి యొక్క సర్వోత్తమ సృష్టిగా చెబుతారు.

భగవానుని యొక్క ఈ సర్వోత్తమ సంరచన వినాశనం దిశగా ప్రయాణి స్తూవుంటే, పాపం ఆయన చూస్తూ ఊరుకోలేడుగా!

ఈనాటి అప్రాకృతిక జీవిత విధానాన్ని ప్రోత్సహిస్తోన్న అమెరికా యొక్క ఆధిపత్యానికి గండి కొట్టే సంఘటనకు ప్రకృతి బాటలు వేసింది.



అదే 10 సంవత్సరాల క్రిందట జరిగిన ఇరాక్ యుద్ధం.

ఇరాక్ యుద్ధం అమెరికా పాలిట శాపంగా ఏ విధంగా మారిందో తెలియజేసే వ్యాసం 20.3.13 న "సాక్షి" దినపత్రికలో వెలువడింది.

ఐఎఫ్‌టియూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ పి. ప్రసాదుగారి వ్రాసిన ఈ విశ్లేషణను ఈ దిగువన ఒకసారి పరిశీలిద్దాం.

**(ప్రారంభం .......)**

ఇరాక్‌ను అమెరికా సంకీర్ణ కూటమి దురాక్రమించి నేటికి (20.3.13) పదేళ్లు.

శ్రీ ఈ పదేళ్ల దురాక్రమణ పర్వం అమెరికాని రుణగ్రస్త దేశంగా మార్చింది.

✡ ఇరాక్‌పై యుద్ధంతో అమెరికా ఆర్థికవ్యవస్థ దారుణంగా చితికిపోయింది.

-- తన పెరటిదొడ్డిగా భావించిన లాటిన్ అమెరికా దేశాలను సైనికంగా నియంత్రించే అవకాశాన్ని కూడా ఇందువల్లనే అది కోల్పోయింది.

-- యూరప్ మీద తన పట్టును కూడా కోల్పోతున్నది.
'పిగ్స్' దేశాల (పోర్చుగల్, ఇటలీ, గ్రీసు, స్పెయిన్) ఆర్థిక సంక్షోభ నివారణ కు ఆర్థిక ప్యాకేజీలను సమకూర్చలేకపోతున్నది.

-- అఫ్ఘనిస్తాన్‌లో కూడా తన యుద్ధ లక్ష్యం నెరవేర్చుకోలేకపోతున్నది.

-- కాస్పియన్ సముద్రతీర దేశాల మీద పట్టు సాధించేందుకు అమెరికా చేస్తున్న ప్రయత్నాలు కూడా విఫలమవుతున్నాయి.

-- మధ్య ఆసియాలోని ఇస్లామిక్ దేశాలతో గతంలో చేసుకున్న సైనిక ఒప్పం దాలకు కాలం చెల్లి అవి క్రమంగా రష్యాకు చేరువవుతున్నాయి. తద్వారా అక్కడ నుంచి ఉపసంహరించుకోక తప్పడం లేదు.

-- ఇరాన్‌పై దూకుడును కూడా తగ్గించుకోక తప్పడం లేదు.

-- ఇజ్రాయెల్‌కు భరోసా ఇవ్వలేకపోతున్నది.

-- ఆక్రమిత ఇరాక్, ఇరాన్‌ల రాజకీయ ప్రాబల్యాన్ని నివారించలేకపోతున్నది.

-- ఈ అన్ని వెనకడుగులకు ఇరాక్ ఆక్రమణే కారణం.

✡ నోబెల్ బహుమతి గ్రహీత జోసెఫ్ స్టిగ్లిట్జ్ రచించిన 'ఇరాక్‌పై మూడు ట్రిలియన్ల డాలర్ల యుద్ధం' అనే గ్రంథంలో అమెరికా ఆర్థిక వ్యవస్థను 'ఇరాక్‌పై యుద్ధం' దిగజార్చిందని కళ్లకు కట్టినట్లు వివరించాడు.

మరో అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకుడు రాబట్ హోర్మట్ రచించిన "స్వేచ్ఛ కోసం చెల్లించిన మూల్యం - యుద్ధానికి చెల్లింపులు" అనే గ్రంథం కూడా సాక్ష్యాధారాలతో వివరించింది.

✡ ప్రపంచ ప్రఖ్యాత పురోగామి మేధావి వాల్డెన్ బెల్లో రచించిన "నాడు రోమ్ - నేడు వాషింగ్టన్" వ్యాసంలో అజేయమనుకున్న అమెరికన్ సైనిక శక్తి, ఇరాక్ ప్రజల పట్టణ గెరిల్లా యుద్ధం ఎదుట ఓటమి చెందిన పరిస్థితిని విశ్లేషించింది.

జేమ్స్ పెట్రాస్, నోమ్ చోమ్‌స్కీ వంటి వామపక్ష మేధావులు ఎందరో అమెరికా పాలిట మరో వియత్నాంగా ఇరాక్ మారిన క్రమాన్ని విశ్లేషించారు.

అంతెందుకు! థామస్ ఫ్రీడ్‌మన్, పాల్ క్రుగ్‌మన్ వంటి నయా ఉదార వాద మేధావులు సైతం ఇరాక్‌పై యుద్ధం అమెరికన్ ఆర్థిక వ్యవస్థకు శాపంగా మారిందని ఏకరువు పెడుతూనే ఉన్నారు.

ప్రచ్ఛన్న యుద్ధానంతర ప్రపంచ గమన దిశను 'ఇరాక్ యుద్ధం' మౌలికంగా మార్చిన వాస్తవాన్ని ఈ విశ్లేషణలు తేటతెల్లం చేస్తున్నాయి.

మొదటి గల్ఫ్ యుద్ధం (1991) నాటికి అమెరికాది ఏకధ్రువ అగ్రరాజ్య



హోదా. అలాంటి అమెరికా మాటను కాదనలేక ఆనాటి యుద్ధ ఫలితాలలో అంటే చమురు లాభాలలో కనీస వాటా కూడా కోరకుండా, యుద్ధ భారాలలో మాత్రం వాటాదార్లుగా కొన్ని సంపన్న రాజ్యాలు సైతం చేరాల్సి వచ్చింది.

✡ నిజానికి ఆనాడు 42 రోజులు సాగిన 32 దేశాల సైనిక సంకీర్ణ కూటమి యుద్ధం వల్ల సద్దామ్ ప్రభుత్వం పతనమై ఉంటే, పరిస్థితి వేరుగా ఉండేది.

-- దాని తదనంతరం ఏర్పడే కీలుబొమ్మ ప్రభుత్వ హయాంలో సంపదను ఒక్క అమెరికా (బ్రిటన్‌కి కొద్ది భిక్ష పెట్టి) అనుభవించి ఉండేది.

అమెరికా అంచనాలను తలకిందులు చేస్తూ, యుద్ధానంతరం ఆర్థిక, ఆహార, ఆయుధ, చమురు ఆంక్షల మధ్య కూడా మరో పన్నెండేళ్లు (1991-2003) సద్దాం ప్రభుత్వం నిలబడింది.

అందుకు ఇరాకీ ప్రజల దేశభక్తియుత చైతన్యమే ప్రధాన కారణం.

అందుకే చమురు సంపదపై అధికారం ఆశించి బహిరంగ దురాక్రమణకి దిగాల్సి వచ్చింది.

ఈ పన్నెండేళ్ల పాటు గల్ఫ్‌లో సైనిక కేంద్రీకరణ, పొరుగు దేశాలలో సైనిక శిబిరాల నిర్వహణ, ఇరాక్ గగనతలంపై పరిమిత వైమానిక దాడుల కోసం అమెరికా ముందస్తు అంచనా కంటే అనేక రెట్లు ఎక్కువ ఆర్థిక భారాలను మోయాల్సి వచ్చింది.

ఈ పన్నెండేళ్ల జాప్యం అమెరికా ఏకధ్రువ అగ్రరాజ్య హోదాను కఠిన పరీక్షకు గురిచేసింది.

✡ ఈ నేపథ్యంలో రెండో గల్ఫ్ యుద్ధంగా ప్రాచుర్యం పొందిన ఇరాక్ దురాక్రమణ (2003 మార్చి 20) నాటికి పరిస్థితిలో మార్పువచ్చింది.

యుద్ధానంతరం లభించే ఇరాక్ చమురులో వాటా ఇవ్వకుండా, యుద్ధ భారాలను ఎందుకు మోయాలని కొన్ని సంపన్న రాజ్యాలు అమెరికాని ప్రశ్నించాయి. యుద్ధ కూటమిలో చేరకపోవడంతో పాటు అవి యుద్ధాన్ని నిరసించాయి కూడా!

✡ ఇది ప్రపంచ గమనంలో వచ్చిన కీలక మార్పునకు సంకేతం.

-- అమెరికా బలాలూ, బలగాలలో వచ్చిన మార్పునకు ఈ పరిణామం ఒక బలమైన నిదర్శనం.

ఇంతకంటే ముఖ్యమైన గుణాత్మక మార్పు 2003-2008 మధ్య జరిగింది. ఇరాక్ ఆక్రమణ నాటి పరిస్థితులకీ, ఆక్రమణ అనంతర కాలంలో ముందుకొచ్చిన పరిస్థితులకీ మధ్య జరిగిన ఈ మౌలిక మార్పు వర్తమాన ప్రపంచ గమన దిశను మార్చివేసింది. బ్రిటన్, కెనడా వంటి అరకొర సంకీర్ణ సభ్యరాజ్యాలకి, ఆక్రమిత ఇరాక్‌లో పరిమితంగానైనా చమురు మీద లాభావకాశాలు లభించాయి.

అప్రతిహతంగా సాగిన ఇరాకీ గెరిల్లా పోరాటాల వల్ల ఈ మూడు రకాల అమెరికన్ కార్పొరేట్ వ్యవస్థల (ఆయుధ, చమురు, నిర్మాణ రంగాలు) మురిపెం మూణ్నాళ్ల ముచ్చటగా మారింది.

✡ అమెరికా ముందస్తు అంచనాలన్నింటినీ తలక్రిందులు చేస్తూ, ఇరాకీ గెరిల్లా యుద్ధం సాగింది. అది 2006 కి ఉన్నత దశకి చేరింది.

పీపా ఇరాకీ చమురు కోసం లీటరు అమెరికన్ నెత్తురును ధారపోస్తున్నదన్న విమర్శను సొంత దేశ ప్రజల నుంచి ఎదుర్కోవాల్సి వచ్చింది.

"చమురు కంటె నెత్తురు చిక్కన" అన్న నినాదం అమెరికా పౌర సమాజం ఒత్తిడికి బ్రిటన్ ప్రభుత్వం తలవంచి, తన సేనలను ఇరాక్ నుంచి ఉపసంహరించుకుంది.



ఆత్మాహుతి దాడుల ధాటికి అమెరికన్ సైనిక నష్టాలు బుష్ ప్రభుత్వాన్ని క్రుంగదీశాయి.

ఈ పరిస్థితుల్లో సంకీర్ణ సభ్య దేశాలను నిలబెట్టుకునేందుకు ఇరాకీ చమురు క్షేత్రాలలో వాటాలను నిర్దిష్ట పరిమాణాల్లో కేటాయించాల్సి వచ్చింది.

అది అక్కడితో ఆగలేదు. సంకీర్ణ కూటమిలో చేరకుండా, ఇరాక్ ఆక్రమణను నిరసించిన రష్యా, చైనాలకి కూడా చమురులో వాటా ఇవ్వచూపింది.

✡ ఏకధ్రువ స్థితిని అమెరికా తనకు తానే దిగజార్చుకున్న పరిణామంగా ఇది వర్తమాన ప్రపంచ చరిత్రలో నిలుస్తోంది.

అనివార్య పరిణామాల ఫలితంగా నేడు ఇరాక్‌లో అమెరికా కార్పొరేటు వ్యవస్థల లాభాల శాతం తగ్గింది. 'యుద్ధ సంకీర్ణత' స్థానంలో 'లాభాల సంకీర్ణత' ఏర్పడింది. అందుకే నేడు బహుళ ధ్రువ వాణిజ్య వ్యవస్థకు ఇరాక్ ఒక ప్రతీకగా మారింది.

సోవియట్ యూనియన్ పతనానంతరం తెగబలిసిన అమెరికన్ ఆర్థిక వ్యవస్థకి మొదటి గల్ఫ్ యుద్ధ వ్యయం ఓ లెక్కలోనిది కాదు. పైగా సగానికిపైగా నాటి యుద్ధ వ్యయాన్ని సంకీర్ణ సభ్యదేశాల మీద రుద్దింది.

✡ కానీ జోసెఫ్ స్టిగ్లిట్జ్ చెప్పినట్లు మూడు ట్రిలియన్ల యుద్ధంగా మారిన 'ఇరాక్ యుద్ధం' అమెరికా ఆర్థిక వ్యవస్థని 'నెత్తురోడుతున్న గాయం'గా మార్చింది.

-- ఇప్పుడు అఫ్ఘానిస్తాన్‌లో అమెరికా యుద్ధంపై చేస్తున్న అత్యల్ప వ్యయం కూడా ఆర్థిక సంక్షోభాన్ని తీవ్రతరం చేసే పరిస్థితికి దారితీసింది.

-- అందుకే అది ఆక్రమిత లిబియాలో ఫ్రెంచి నాటో సైనిక పాలనను అనుమతించింది.

-- వెనిజులాలో బహిరంగ సైనిక జోక్యానికి వెనకాడింది.

-- అణ్వస్త్ర ఉత్తర కొరియాను కరవాల్సిన స్థితి నుంచి మొరగాల్సిన స్థితికి చేరింది.

-- ఇరాన్ విషయంలో తోక ముడిచింది.

-- అఫ్ఘానిస్తాన్‌లో 'మంచి తాలిబన్లకి అధికారం' కట్టబెట్టి నిష్క్రమించాలని చూస్తున్నది.

-- కీలుబొమ్మ కర్జాయ్ ప్రభుత్వం ద్వారా అక్కడ క్రొత్తగా బయల్పడ్డ ముడి ఇనుము తదితర సహజ వనరులలో రష్యా, చైనా, ఇరాన్‌లతో భాగస్వామ్య ఒప్పందాలకి అనుమతిస్తున్నది.

-- మొత్తంగా ఈ వెనుకంజకు ఇరాక్ ప్రతిఘటనే ముఖ్య కారణం.

☝ అలెగ్జాండర్ మహాసేనలు జీలం నది ఒడ్డున అతి చిన్న ఆటవిక తెగల రాజ్య సైన్యాల ప్రతిఘటనకు భీతిల్లిన ఫలితంగా ప్రాచీన గ్రీకు సామ్రాజ్యం విచ్ఛిన్నమైనది.

-- సీజరు సేనలు ఇంగ్లాండ్ ఆటవిక జాతుల ఎదుట ఓడినందునే ప్రాచీన రోమన్ సామ్రాజ్యం పతనమైనది.

-- జర్మానిక్, శాక్సన్ సంచార జాతుల తిరుగుబాట్లతో  మధ్యయుగ రోమన్ సామ్రాజ్యం కుప్పకూలింది.

-- ఆధునిక యుగంలో రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్య సేనలు గొర్రెలు కాచుకునే అఫ్ఘానిస్తాన్ పఠాన్ జాతుల చేతుల్లో ఘోరంగా భంగపడ్డాయి.

-- అదే అఫ్ఘానిస్తాన్ గెరిల్లా ప్రతిఘటన వల్ల సోవియట్  రష్యా 1980లలో తన అగ్రరాజ్య హోదానే కోల్పోయింది.



-- అంతకంటే ముందే వియత్నాం గెరిల్లా పోరాటంలో అమెరికా చావు తప్పి కన్నులొట్టపోయి బయటపడింది.

-- ఈసారి ఇరాక్ దెబ్బకి అమెరికా కన్ను లొట్టపోతుందో, లేదంటే అగ్రరాజ్య హోదానే కోల్పోతుందో చరిత్రకే వదిలేద్దాం!

✡ అమెరికాకు ఇష్టం లేని పనిని
అమెరికాతో చేయించిన ఘనత ఇరాక్ ప్రజలదే.

✡ ఇరాకీ ప్రజలు కార్చిన కన్నీళ్లు,
చిమ్మిన నెత్తుటి కాల్వలూ,
చిదిమిన యవ్వనమూ,
సలిపిన ఆత్మ బలిదానాలూ,
పొందిన అమరత్వాలూ
ప్రపంచ చరిత్రలో చెరిగిపోనివీ, చెదిరిపోనివీ.

-- అలాంటి త్యాగపూరిత జాతికి  పీడిత ప్రపంచం రుణపడి ఉంటుంది.

అమెరికన్ సైనికాధికారి బ్రాడ్లీ మ్యానింగ్ సైనిక న్యాయస్థానంలో విచారణను ఎదుర్కొంటూ ఇచ్చిన 35 పేజీల ఒప్పుకోలు ప్రకటన ఇరాక్ ప్రజలు పడిన యాతనను, వేదనను మరోసారి లోకం ముందు ఉంచాయి.

ఎద్దు పుండు కాకికి  పండగ అన్నట్లు ఇరాక్ ప్రజల త్యాగాలు రష్యా, చైనాలకి లాభాల పంటగా మారకూడదు.

అలా కాకుండా, ఇరాక్ విమోచనకి సహకరించే రోజు రావాలి.